క్లుప్తంగా

నేడు కార్యకర్తలతో దద్దాల సమీక్ష

వెలిగండ్ల: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు కార్యకర్తలతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి తెలిపారు. సమీక్షకు ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పాల్గొంటారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, బూత్ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరు కావాలని కోరారు.

19 నుంచి లక్ష్మీ నరశింహ స్వామి బ్రహ్మోత్సవాలు

గుడ్లూరు: మండలంలోని తెట్టు గ్రామంలో కొండపై ఉన్న లక్ష్మీ నరశింహస్వామి ఆలయంలో ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు లక్ష్మీ నరశింహ స్వామి వారి త్రయాహ్నిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయని ఆలయ ధర్మకర్తలు విశ్వనాథ్, ప్రదీప్‌కుమార్, ఆలయ పూజారులు సాయి భరద్వాజ్, నారాయణ కేశవాచార్యులు శుక్రవారం తెలిపారు. 19వ తేదీ సుప్రభాత సేవ, స్వామివారిక, పరివార దేవతలకు అభిషేకం, అంకురార్పణ, 20వ తేదీ సుప్రభాత సేవ, గరుడ హోమం, శేషవాహన సేవ, 21న సుప్రభాతసేవ, తిరువారాధన, కల్యాణ నలుగులు, అన్నదానం, గిరి ప్రదక్షణ, ఎదురుకోలు మహోత్సవం, గరుడ సేవ, 22న పూలంగి సేవ, చందన అలంకారం, కల్యాణ మహోత్సవం, అన్నదానం, వసంతోత్సవం, ఏకాంతసేవ 23వ తేదీ సుప్రభాత సేవ, స్వామివారు, పరివారదేవతలకు అభిషేకం, అర్చన, తీర్థ ప్రసాదాలు వినియోగం కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. 5 రోజులు పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేటి నుంచి కోదండరామ స్వామి తిరునాళ్ల


సీత, రామ, లక్ష్మణ, హనుమంత మూల విగ్రహమూర్తులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని రామాపురంలో కోదండరామస్వామి తిరునాళ్ల శనివారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం వారం తెలిపారు. ఈ సందర్భంగా శనివారం సీతా రాముల శాంతి కల్యాణోత్సవం, ఆదివారం వనభోజనాల కార్యక్రమం ఉంటుందన్నారు. అదేవిధంగా సోమవారం ఉదయం 7.30 గంటలకు 5 జిల్లాల స్థాయి ఎడ్ల పోటీలు, మంగళవారం గ్రామ దేవత పోలేరమ్మ తిరునాళ్ల నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నియోజకవర్గ వ్యాప్తంగా మోస్తరు వర్షాలు

కందుకూరు: దాదాపు రెండు నెలల నుంచి మండుతున్న ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఊహించని విధంగా కురుస్తున్న వర్షాలు కాస్త ఊరటనిస్తున్నాయి. గురువారం రాత్రి ఒక్కసారి వర్షం ముంచెత్తడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. అదే సందర్భంలో పలు మండలాల్లో మోస్తారు వర్షపాతం నమోదైంది. గురువారం రాత్రి కురిసిన వర్షాల ధాటికి వలేటివారిపాలెంలో 13.8 మి.మిలు, కందుకూరులో 12.2 మిమి, వలేటివారిపాలెం మండలంలో అత్యధికంగా 35.2 మి.మి, గుడ్లూరులో 18.4 మి.మి, ఉలవపాడు మండలంలో అత్యల్పంగా 7.8 మి.మిల వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు పొలాలు దుక్కులు దున్నుకునేందుకు, సకాలంలో పచ్చిరొట్ట ఎరువుల పంటలను సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అదే సందర్భంలో తీవ్ర గ్రాసం కొరతతో అల్లాడుతున్న పశువులకు ఈ వర్షాలు మేలు చేసినట్టేనని భావిస్తున్నారు.

సర్వీస్ ఓట్లు ఉపయోగించుకుంటున్న ఉద్యోగులు

కందుకూరు: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా సుదూర ప్రాంతాల్లో ఉంటున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించి తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. ప్రధానంగా ఆర్మీలో పనిచేస్తున్న ఉద్యోగులకు, ఇతర సర్వీసుల్లో పనిచేస్తున్న వారికి సర్వీస్ ఓట్లను అధికారులు కేటాయించారు. నియోజకవర్గంలో సర్వీస్ ఓట్లు 66 వరకు ఉన్నాయి. వీటిని క్రమంగా ఆయా ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతానికి నియోజకవర్గంలో 16 మంది మాత్రమే తమ సర్వీస్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ క్రమంలో శుక్రవారం పలువురు ఆర్మీ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీటిని స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో భద్రపరుస్తున్నారు. ఓట్ల లెక్కింపు జరిగే జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటల వరకు ఈ సర్వీస్ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉందని, సర్వీస్ ఓటు హక్కు కలిగిన ఉద్యోగులు తమ ఓటు హక్కును జూన్ 4లోపు ఎప్పుడైనా వేయవచ్చని ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు తెలిపారు.


శోభాయమానంగా అలంకరించిన దేవాలయం


ప్రత్యేక పూజల్లో భక్తులు

వైభవంగా బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవం


విశిష్ట అలంకరణలో విగ్రహమూర్తులు


బ్రహ్మంగారి మూలవిరాట్


కారుమంచిలో ప్రత్యేక అలంకరణలో వీరబ్రహ్మేంద్ర స్వామి


పూజలు చేస్తున్న భక్తులు


అన్నదానంలో భక్తులు


మర్రిపూడిలో వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవం

పామూరు: శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామివారి 331వ ఆరాధన మహోత్సవం శుక్రవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నెల్లూరు రోడ్డులోని బ్రహ్మంగారి ఆలయంతో పాటు స్థానిక వైఎస్సాఆర్ సెంటర్ వద్ద వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో అర్చకులు శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల మూలవిగ్రహ, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించగా పూజల్లో భక్తులు పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు అభిషేకం, కుంకుమపూజ చేశారు. ఈసంద్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం, దాతల సాయంతో ఆలయాల వద్ద అన్నదానం చేశారు. వినుకొండ రామాచారి, ఎం.దొరసానయ్యాచారి, శానంపూడి చంద్రశేఖర్, వి.బాలబ్రహ్మాచారి, నొస్సం నాగేంద్రాచారి, వెగ్గళం మల్లికార్జున, వై.సంజీవరెడ్డి, ఎస్.సాంబయ్య, కడప ఓంకార్, యు.ప్రభాకర్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన బ్రహ్మంగారి ఆరాధన

పీసీపల్లి: మండల పరిధిలోని పడమటపల్లిలో రెండు రోజులుగా బ్రహ్మంగారి ఆరాధన ఘనంగా జరుగుతోంది. ఆరాధన సందర్భంగా రెండు రోజులుగా పడమటిపల్లి, మలినేనివారిపల్లి గ్రామాల్లో ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తులు బ్రహ్మంగారి నామసంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఆరాధన సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా భక్తులు ప్రాతఃకాలమునే ఆలయానికి విచ్చేసి స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

వైభవంగా బ్రహ్మంగారి ఆరాధనోత్సవం

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ముళ్లపాడు, దర్శి తిమ్మక్కపల్లి కూడలిలో శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామివారి 331వ ఆరాధనా మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల మూలవిగ్రహమూర్తులకు, ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం అర్చకుల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల ఉత్సవ మూర్తులకు కల్యాణోత్సవం నిర్వహించి అనంతరం సాయంత్రం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పులి వెంకటకొండయ్య, రామిరెడ్డి, వెంకట నారాయణరెడ్డి, నారపురెడ్డి శివరామిరెడ్డి, ఉద్ది రమణయ్య, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వీర బ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం

కనిగిరి రూరల్: పట్టణంలోని గార్లపేట రోడ్డు మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణం

మర్రిపూడి: మండల కేంద్రమైన మర్రిపూడి పడమటి బజారులో గురువారం రాత్రి గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవం వైభవంగా సాగింది. శుక్రవారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద అర్చకులు సుధీర్ ఆధ్వర్యంలో ఆరాదన మహోత్సవం కనుల పండుగగా సాగింది. మహిళలు బోనాలతో ఊరేగింపులో పాల్గొని తమ మొక్కులు చెల్లించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన

టంగుటూరు: టంగుటూరు మండలంలోని కారుమంచి గ్రామంలో జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి గోవిందమాంబ సమేత సంతాన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన, గురుపూజ మహోత్సవం శుక్రువారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమాలు, అర్చనల అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ధర్మకర్త నీరుకొండ సింగయ్య ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గ్రామాల్లో ప్రశాంతంగా ఉండాలి

- డీఎస్పీ రత్నాకర రామరాజు


మాట్లాడుతున్న డీఎస్పీ రామరాజు

కనిగిరి రూరల్: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ప్రశాంతంగా ఉండాలని కనిగిరి డీఎస్పీ ఆర్.రామరాజు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం మూడు మండలాల రాజకీయ పార్టీల నాయకులతో పీస్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ రామరాజు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ ఘట్టం ముగిసిందని, కౌంటింగ్ ప్రక్రియ జరగాల్సి ఉందన్నారు. ఎన్నికల తర్వాత గ్రామాల్లో ఇరుపార్టీ నేతలు, కార్యకర్తలు ఎటువంటి గొడవలు పడకుండా, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. కౌంటింగ్ రోజు పొరుషాలకు, ప్రిస్టేజ్‌లకు పోకుండా శాంతియుతంగా ఉండాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లఘించిన, చట్ట వ్యతిరేక, అవాంఛనీయ కార్యక్రమాలకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కల్గించిన వారిపై చట్టప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, శాంతియుతంగా ముగిసేందుకు సహకరించాలన్నారు. సీఐ డి.వెంకటేశ్వరరావు, ఎస్సైలు టి.త్యాగరాజు, పి.శివనాగరాజు, టి.రమేష్ బాబు, మున్సిపల్ చైర్మన్ గఫార్, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, చింతం శ్రీను, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, జి.బొర్రారెడ్డి, పెన్నా ఏడుకొండలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

శీతల గిడ్డంగుల్లో బేళ్ల వివరాలు తెలపాలి

- పొగాకు బోర్డు ఆక్షన్ మేనేజర్, ఇన్‌చార్జి సెక్రటరీ వేణుగోపాల్


టంగుటూరులో వేలాన్ని పరిశీలిస్తున్న పొగాకు బోర్డు ఆక్షన్ మేనేజర్, ఇన్‌చార్జి సెక్రటరీ వేణుగోపాల్

టంగుటూరు: రైతులందరూ శీతల గిడ్డంగుల్లో ఉన్న బేళ్ల వివరాలను వాటి నుంచి బయటకు తీసేటప్పుడు బోర్డు వారికి తెలపాలని పొగాకు బోర్డు ఆక్షన్ మేనేజర్, ఇన్‌చార్జి సెక్రటరీ వేణుగోపాల్ అన్నారు. స్థానిక వేలం కేంద్రాన్ని ఒంగోలు పొగాకు బోర్డు ప్రాంతీయ అధికారి లక్ష్మణరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వేలం కేంద్రంలో వివిధ పొగాకు గ్రేడులకు వచ్చిన ధరలను పరిశీలించి, రైతులతో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులు అన్ని రకాల గ్రేడులను వేలానికి తీసుకు రావాలి, అందులో అన్య పదార్థాలు లేకుండా జాగ్రత్తలు వహించాలని కోరారు. మార్కెట్ నడుస్తున్న ప్రకారం పొగాకు బేళ్లను తెచ్చుకోవాలి, సాఫ్ట్, హీటు, గ్రేడు మిక్స్ లేకుండా తెచ్చుకోవాలని, రైతులు ఎవరూ అనధికారికంగా పొగాకు అమ్మరాదని సూచించారు. అలాగే కంపెనీ బయ్యర్లతో మాట్లాడి అన్ని రకాల గ్రేడ్లను కొనుగోలు చేయాలని కోరారు. వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు, రైతు నాయకులు, బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పొగాకు అత్యధిక ధర కేజీ రూ.304

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో పొగాకు అత్యధిక ధర కేజీ రూ.304 పలికింది. జమ్ములపాలెం, తుమాడు గ్రామాల రైతులు 1005 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 974 కొనుగోలయ్యాయి. కనిష్ట ధర రూ.205 పలకగా, సరాసరి ధర రూ.270.53 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 37 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కొండపిలో..

కొండపి(సింగరాయకొండ): కొండపి వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో పొగాకు అత్యధిక ధర రూ.304 పలికిందని నిర్వణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. వ్యాపారులు ధర్మవరం, కోయవారిపాలెం, వెంకట కృష్ణాపురం, ముక్కోడిపాలెం, తాటాకులపాలేనికి చెందిన రైతులు 1040 బేళ్లు తీసుకురాగా 1000 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 40 బేళ్లను తిరస్కరించారు. కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.267.38 పలికింది. వేలంలో 20 మంది వ్యాపారులు పాల్గొన్నారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు నిర్వహించిన వేలంలో శుక్రవారం అత్యధిక ధర రైతులకు దక్కిందన్నారు.

ఎదిగేకొద్దీ ఒదిగి ఉండాలి


పూర్వ విద్యార్థులు

పీసీపల్లి: ఎదిగేకొద్దీ ఒదిగి ఉండాలని హెచ్‌ఎం ఏనుగంటి తిరుపతయ్య అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1996–97 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ మనం ఏ హోదాలో ఉన్నా బంధుత్వాలు, స్నేహం వద్ద ఒదిగి ఉండాలని కోరారు. అనంతరం ప్రతి ఒక్కరూ ఆలింగనం చేసుకొని ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ సభ్యులతో పాల్గొని తమ పూర్వ జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు హెచ్‌ఎం మాలకొండారెడ్డి, పీడీ వెంకటేశ్వర్లును సత్కరించారు. తాటికొండ వెంకటేశ్వర్లు, రంజిత్, గోపాల్, గోపవరపు నాగేశ్వరరావు, వెంకట్రావ్ ఉన్నారు.

రైతులు వేసవి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

కందుకూరు: రైతులు వచ్చే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని వేసవి సస్య రక్షణ చర్యలు తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం హెడ్, సీనియర్ శాస్త్రవేత్త జీ ప్రసాద్‌బాబు రైతులకు సూచించారు. వాతావరణ శాఖ అధికారుల సూచనల ప్రకారం ఖరీఫ్ సీజన్‌లో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదవుతుందని, జూన్ మొదటి వారంలో రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని తెలిపారు. వీటి ప్రభావంతో రెండు రోజులుగా పలు ప్రాంతాల్లో వర్షపాతం నమోదవుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు గునపం నాగలి, ఎంబీ ప్లౌ, డిస్క్ హారో వంటి యంత్రాలతో వేసవి దుక్కులు దున్నుకోవాలని సూచించారు. దీని వల్ల నిద్రావస్థలో ఉన్న చీడపీడ ప్యూపాలు, శిలీంద్ర బీజాలు, కలుపు విత్తనాలు, హానికర సూక్ష్మజీవులు బయటపడి ఎండ వేడిమికి లేదా పక్షులకు ఆహారంగా మారి నశిస్తాయని చెప్పారు. వైరస్ తెగుళ్లకు ఆశ్రయం ఇచ్చే వయ్యారిభామ, తుత్తుర బెండ వంటి కలుపు మొక్కలను సామూహికంగా రైతులందరూ పీకి కుప్పచేసి తగులబెట్టాలన్నారు. పొగాకు, పత్తి, కంది పంటల మొదళ్లను రోటావేటర్ సాయంతో భూమిలో కలియదున్నాలని సూచించారు. ఈ తేమను ఉపయోగించుకుని పచ్చిరొట్ట విత్తనాలైనటువంటి జనుము, జీలుగ, పిల్లిపెసర, ఉలవ, అలసంద వంటి వాటిని పొలంలో చల్లుకుని 40 రోజుల తరువాత సగం పూత దశలో ఉన్నప్పుడు పొలంలో రోటావేటర్ సాయంతో భూమిలో కలియ దున్నడం వల్ల భూమిలో సేంద్రియ కర్బనం పెరిగి పంట దిగుబడులు పెరుగుతాయని వివరించారు.


మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్

కనిగిరిలో వైఎస్సార్ సీపీదే విజయం

- ఆ పార్టీ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్
- పార్టీ కోసం పనిచేసిన వారికి న్యాయం చేస్తా

కనిగిరి రూరల్: మంచి మెజార్టీతో కనిగిరిలో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తోంది..పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ తగిన న్యాయం చేస్తా, గుర్తింపు నిస్తా.. అని ఆ పార్టీ కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం కనిగిరి రూరల్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి పంచాయతీలోని బూత్‌ల్లో పార్టీ కోసం శ్రమించి పనిచేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. జూన్ 4న ప్రకటించే ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ఫలితాలతో వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో మళ్లీ చరిత్ర సృష్టించనున్నట్లు వెల్లడించారు. కనిగిరిలో తాను అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తున్నానని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జూన్ 4న మళ్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల్లో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యులుగా చేసి అందరి సహకారంతో ముందుకు నడుస్తానని చెప్పారు. కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, తన గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని హామీ ఇచ్చారు. పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కాసుల గురవయ్య, వీరంరెడ్డి బ్రహ్మరెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, మూలే గోపాల్‌రెడ్డి, ఎస్.మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల, గ్రామ స్థాయి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభించిన సర్పంచ్ వనజ

సింగరాయకొండ(మర్రిపూడి): సింగరాయకొండ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సెంటర్లో తాటిపర్తి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ తాటిపర్తి వనజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో ఏటా చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజలకు దాహార్తిని తీరుస్తామన్నారు. వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, షేక్ ఇస్మాయిల్, పార్టీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, శ్రీశైలం దేవస్థాన ట్రస్టు బోర్డు సభ్యుడు తన్నీరు ధర్మరాజు, సోమిశెట్టి సురేష్, బచ్చు కోటేశ్వరరావు, గాదంశెట్టి గుప్తా, షేక్ పటేల్, షేక్ నౌషాద్, సవళం కోటేశ్వరరావు, షేక్ సలీంబాషా, షేక్ జానీబాషా, రాయి వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తుబోధనలు అనుసరణీయం


చర్చి వద్ద ప్రార్థనల్లో నాయకులు, క్రైస్తవులు

పామూరు: క్రీస్తు బోధనలు అనుసరణీయమని ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య అన్నారు. మండలంలోని మీరాపురంలో నూతనంగా నిర్మించిన సీయోను ప్రార్థన మందిరం శుక్రవారం ప్రారంభంకాగా కార్యక్రమ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్ స్టీఫన్ ఆధ్వర్యంలో చర్చి ప్రారంభం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దైవవాక్యాన్ని వివరించారు. భగవంతుడు ఒక్కడే అని, అన్ని మతాల సారాంశం అదేనన్నారు. ప్రతివ్యక్తి తోటి వారికి అండగా నిలవాలని, స్నేహం, సమానత్వం, సాయగుణం కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరిలు ఆలపించిన గీతాలు అలరించాయి. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, అంబటి కొండారెడ్డి, కొప్పల్ల నాగరాజు, మన్నం మాధవరావు మాజీ సర్పంచ్ యడవల్లి అబ్రహం, చీమలదిన్నె రమణయ్య, జె.గోవిందయ్య, భీమవరపు మాల్యాద్రి, బ్యంగి వెంకటేశ్వర్లు, తాళ్ల నాగేశ్వరరావు, తుమ్మా పిచ్చిరెడ్డి, ప్రహ్లాద, మిత్తికాల బాలకృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కోదండరామ స్వామి కల్యాణోత్సవం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని రేగులచలకలో శ్రీకోదండరామస్వామి ఆలయంలో సీత, రాముల దేవతా ఉత్సవ మూర్తుల కల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మొదట సీత, రామ, లక్ష్మ, హనుమంతుని మూల విగ్రహమూర్తులకు పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం సీత రాముల పంచలోహ విగ్రహమూర్తులను మేళతాళాల నడుమ గర్భాలయం వద్ద నుంచి కల్యాణ వేదికకు తరలించి వేదమంత్రాల నడుమ వైభవంగా శాంతి కల్యాణం నిర్వహించి అనంతరం ప్రత్యేక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. దేవస్థాన కమిటీ, భక్తులు పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్రం తనిఖీ


డయాలసిస్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: డయాలసిస్ సెంటర్ కిడ్నీ బాధితులకు వరం లాంటిదని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. కనిగిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని ఉన్న డయాలసిస్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి బాధితులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

మర్రిపూడి: మండలంలోని రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేయనున్నట్లు వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేశ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనుము, జీలుగ, పిల్లి పెసర లాంటి విత్తనాలు అవసరమైన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. తొలకరిలో పచ్చిరొట్ట విత్తనాలు భూమిలో కలియదున్నితే భూసారం పెరిగి పంట దిగుబడి పెరుగుతుందన్నారు. తద్వారా ఎరువుల ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు


శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

కొండపి(సింగరాయకొండ): కొండపి మండల ప్రభుత్వ భవనాల సముదాయ కార్యలయంలో ఉన్న గ్రంథాలయంలో మే 15 నుంచి జూన్ 7 తేదీ వరకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు అగ్గి రాముడు విద్యార్థులకు ఆంగ్ల భాషలో మెళకువలు నేర్పారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.